30న ట్రిపుల్ ఐటీలో 'టెక్నాలజీ అండ్ సినిమా'

రాయదుర్గం: ట్రిపుల్ఐటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో 'టెక్ ఫార్వర్డ్' రీసెర్చ్ సెమినార్ సిరీస్‌లో భాగంగా జూన్ ఎడిషన్‌ను ఈనెల 30వ తేదీన నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు గచ్చిబౌలిలోని ట్రిపుల్ఐటీ క్యాంపస్‌లో 'టెక్నాలజీ అండ్ సినిమా' అనే అంశంపై ఈ సమావేశం జరుగుతుంది. హైసియా మేనేజింగ్ కమిటీ సభ్యుడు మనోహర్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో బాహుబలి చిత్ర నిర్మాత శోభు యార్లగడ్డ, ట్రిపుల్ఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొ. పి జే నారాయణన్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు.

బీజేపీ డివిజన్ అనుబంధ సంఘాల అధ్యక్షులు వీరే..

రాయదుర్గం: బీజేపీ గచ్చిబౌలి డివిజన్ అనుబంధ సంఘాల అధ్యక్షులను నియమించారు. బీజేపీ గచ్చిబౌలి డివిజన్ ఎస్టీమోర్చా అధ్యక్షులుగా దేవరకొండ గోపాల్, మహిళా మోర్చా అధ్యక్షురాలుగా ఉదయలక్ష్మీ, బీజేవైఎం అధ్యక్షులుగా సామ్రాట్‌గౌడ్‌లను నియమించినట్లు పార్టీ డివిజన్ అధ్యక్షుడు శివాసింగ్ సోమవారం ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీని గచ్చిబౌలి డివిజన్‌లో తిరుగులేని శక్తిగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్

పటాన్‌చెరు టౌన్: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్ అన్నారు. సోమవారం పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలోని గీతం కళాశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ ప్రభాకర్ మాట్లాడుతూ... మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. విద్యార్థులు, యువత బాధ్యతగా తమ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. అనంతరం దాదాపు 30 మంది పోలీసు సిబ్బంది గీతం ప్రాంగణంలో మొక్కలు నాటారు. గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఈఈసీఈ విభాగం అధ్యాపకులు ప్రొఫెసర్ మంజునాథాచారి, ప్రొఫెసర్ త్రినాథ రావు, ఎస్టేట్ అధికారి డీవీఏ మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ముదిరాజ్ బస్తీలో పోచమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

వర్షాకాలం.. విద్యుత్ సమస్యలు ఏర్పడితే..

కూకట్‌పల్లి: వర్షాకాలంలో కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో విద్యుత్ సమస్యలు ఏర్పడినప్పుడు ఈ అధికారుల నంబర్లకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించుకోవచ్చు.

కూకట్‌పల్లి డీఈ 8712472652, కూకట్‌పల్లి ఏఈ 8712472700, భాగ్యనగర్ ఏఈ 8712472698, ఆల్విన్‌కాలనీ 8712472696, హైదర్‌నగర్ ఏఈ 8712472699

ఫ్యూజ్ ఆఫ్ కాల్ నంబర్ : కూకట్‌పల్లి 8712472717, భాగ్యనగర్ 8712472715, ఆలివ్వన్‌కాలనీ 8712472713, హైదర్‌నగర్ 8712472716,

కూకట్‌పల్లి కంట్రోల్ రూమ్: 8712472721, 9490153508 నెంబర్లకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

మురుగు సమస్య



రాయదుర్గం: గచ్చిబౌలిలోని టీఎన్‌జీఓ కాలనీలో ప్రధాన రోడ్లపై డ్రైనేజీ పారుతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. నిరంతరం డ్రైనేజీనీరు రోడ్లపై పారుతుంటే అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.



రామకృష్ణనగర్‌లో వరద నీరు చేరుతున్న వీధి ఇదే..



రామకృష్ణనగర్‌లో వరద నీటితో నిండిన అపార్ట్‌మెంట్ సెల్లార్ (ఫైల్)



చందానగర్ రైల్వే స్టేషన్ వద్ద అండర్ పాస్‌లో వరద నీరు (ఫైల్)

ముంపు.. ముప్పు

- వర్షం వస్తే సెల్లార్లు, ప్రభుత్వ పాఠశాల మునక
- చందానగర్ సర్కిల్– 21 పరిధిలో 10 లాగింగ్ పాయింట్స్

వరద కాల్వ నిర్మించినా అదే పరిస్థితి

చందానగర్: నాలా విస్తరణ, వరద కాలువల నిర్మాణం జరిగినా ముంపు సమస్య పరిష్కారం కావడం లేదు. చందానగర్ సర్కిల్ పరిధిలోని హఫీజ్‌పేట్ డివిజన్‌లో ముంపు సమస్య అలాగే ఉంది. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు డివిజన్ పరిధిలోని మదీనాగూడ, రామకృష్ణనగర్, దత్తసాయి కాలనీ, జనప్రియనగర్, జనప్రియ అపార్ట్‌మెంట్స్ సెల్లార్లు వరద నీటితో నిండాయి. దీంతో



చందానగర్ జాతీయ రహదారి వద్ద ఉన్న చిన్న బాలాజీ టవర్స్ సెల్లార్ మునక (ఫైల్)



వరద నీరు చేరిన మదీనాగూడ ప్రభుత్వ పాఠశాల

ఎమ్మెల్యే గాంధీ, జీహెచ్ఎంసీ అధికారులు యుద్ధ ప్రాతిపదికన నాలా విస్తరణ, వరద కాలువల పనులు చేపట్టారు. ఈర్ల చెరువు నుంచి దీప్తిశ్రీనగర్ నాలా వరకు 600 మీటర్లకు రూ.9 కోట్లతో కాలనీ మధ్య నుంచే వరదనీటి కాలువ నిర్మించారు. కాగా ఇటీవల కురిసిన భారీ వర్షానికి రామకృష్ణ నగర్‌లో ఓ వీధిలోని సెల్లార్లు వరద నీటితో మునిగాయి. మదీనాగూడ ప్రభుత్వ పాఠశాలలోకి భారీగా వరద నీరు చేరి మునిగింది.

చిన్న పాటి వర్షానికే...

వర్షాకాలం రామకృష్ణనగర్‌లో అపార్ట్‌మెంట్‌లలోని సెల్లార్లు వరద నీటితో నిండిపోతాయి. వాహనాలు, వాచ్‌మెన్ గది పూర్తిగా నీటిలో ఉంటాయి. గత సంవత్సరం చేపట్టిన వరద నీటి కాలువ వల్ల కొంత తగ్గినా రామకృష్ణ నగర్ కాలనీలో కొన్ని అపార్ట్‌మెంట్‌లు మునిగిపోతున్నాయి. ఇక మదీనాగూడ ప్రభుత్వ పాఠశాలలో పలు కాలనీల నుంచి వచ్చే వర్షపు నీరు నేరుగా తరగతి గదులలోకి వెళ్తున్నాయి. వర్షం వస్తే ఆ రోజు పాఠశాలకు సెలవు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. వైశాలీనగర్ లింక్ రోడ్డులోని రైల్వే అండర్ బ్రిడ్జి కింద, చందానగర్ రైల్వే స్టేషన్ అండర్ బ్రిడ్జిలు చిన్నపాటి వర్షానికే బ్రిడ్జి నిండిపోతాయి. చందానగర్ జాతీయ రహదారిపై నూతనంగా ఫ్లైఓవర్ నిర్మించడం వలన చిన్నం బాలాజీ టవర్స్‌లోని సెల్లార్లు మునగడంతో కోట్లల్లో ఆస్తి నష్టం జరిగింది.

చందానగర్ సర్కిల్ 21 పరిధిలో వాటర్ లాగింగ్ పాయింట్స్

సర్కిల్ పరిధిలో వాటర్ లాగింగ్ పాయింట్స్‌ను డివిజన్ల ప్రకారం మాదాపూర్‌లో 07 (బాటా షోరూమ్, కొత్తగూడ అండర్ పాస్, 100 ఫీట్ అండర్ పాస్, ఏసీ బస్టాప్, కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయం, ఓల్డ్ హఫీజ్‌పేట్), మియాపూర్‌లో 02 (లక్కీ రెస్టారెంట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్), హఫీజ్‌పేట్ 01 (వైశాలీనగర్ లింక్ రోడ్డులోని రైల్వే అండర్ బ్రిడ్జి)

చర్యలు తీసుకోవాలి



గత సంవత్సరం ఈర్ల చెరువు నుంచి దీప్తిశ్రీనగర్ వరకు రామకృష్ణనగర్ కాలనీ మధ్యలో నుంచి వరద నీటి కాలువ నిర్మించారు. దీంతో ముంపు నుంచి బయటపడ్డాం. కానీ కాలనీలోని కొంత భాగం మునక అవుతోంది. జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– వాలా హరీష్‌రావు, రామకృష్ణనగర్

చిన్నపాటి వర్షానికే..



వర్షాకాలం వస్తే చాలు మదీనాగూడ స్కూల్లో తరగతి గదులలో వర్షం నీరు వచ్చి చేరుతుంది. దీంతో చిన్నారులు, విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. పాఠశాలలోకి వర్షపు నీరు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– గౌడే గోపాల్, మదీనాగూడ



హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో ముంపునకు గురవుతున్న మదీనాగూడ దత్తసాయి కాలనీ

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్: అల్లాపూర్ సొసైటీ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రవిచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు సరోజినీ అపార్ట్‌మెంట్స్, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ఏరియా, అల్లాపూర్ సొసైటీ, భవ్య అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

చందానగర్‌లో..

చందానగర్: వేమనకాలనీ, చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో..

- పీజేఆర్ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు పీజేఆర్ రోడ్డు నెంబర్ 1,3,5,7,10,12, లగ్జరీ హైట్స్ అపార్ట్‌మెంట్స్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.
- సురక్ష ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు సురక్ష ఎన్‌క్లేవ్, విద్యనగర్, రాజేందర్‌రెడ్డి నగర్, సత్య ఎన్‌క్లేవ్ ప్రాంతాలలో ..
- ఫ్రెండ్స్ కాలనీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ఫ్రెండ్స్ కాలనీ, అర్జున్‌రెడ్డి కాలనీ, శిల్పా ఎన్‌క్లేవ్, వెస్ట్ మెట్రో అపార్ట్‌మెంట్స్ ప్రాంతాలలో ..

హఫీజ్‌పేట్ సెక్షన్ పరిధిలో...

- సుభాష్‌చంద్రబోస్‌నగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.00 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు ఆదిత్యనగర్, సుభాష్‌చంద్రబోస్‌నగర్, కృష్ణ కాలనీ, ఆదిత్యనగర్ మెయిన్ రోడ్డు ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

గచ్చిబౌలి సబ్‌స్టేషన్ పరిధిలో..

రాయదుర్గం: గచ్చిబౌలి సబ్‌స్టేషన్ పరిధిలో.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఏపీహెచ్‌బీ కాలనీలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటనారాయణరెడ్డి తెలిపారు.

- 11 కేవీ జయభేరి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏపీహెచ్‌బీ కాలనీ, జయభేరి ఎన్‌క్లేవ్, ఓల్డ్ గచ్చిబౌలి, లెమెరీడియన్, యూనివర్సల్ రియల్టర్స్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాలలో ..

రాయదుర్గంలో..

వైట్‌ఫీల్డ్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ..ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శ్రీరామ్‌నగర్ సీ బ్లాక్‌లో, అదేవిధంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శ్రీరామ్‌నగర్ బీ బ్లాక్ ప్రాంతంలో విద్యుత్ ఉండదని అధికారులు తెలిపారు.

అవుట్‌లెట్ సమస్య పరిష్కారానికి కృషి

లక్ష్మీవిహార్ ఫేజ్–2 కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే గాంధీ



కాలనీలో డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కాలనీవాసులు

శేరిలింగంపల్లి: లక్ష్మీవిహార్ ఫేజ్–2 కాలనీలో డ్రైనేజీ అవుట్‌లెట్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. గచ్చిబౌలి డివిజన్ లక్ష్మీవిహార్ కాలనీలో జలమండలి అధికారులతో కలిసి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా గాంధీ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం నరేందర్, మేనేజర్ అభిషేక్, కాలనీ అధ్యక్షులు రవీంద్రప్రసాద్ దూబే, ఉపాధ్యక్షులు గురుదత్తు, జాయింట్ సెక్రటరీ రఘువీర్, మాజీ కౌన్సిలర్ మోహన్‌గౌడ్, నాయకులు మంత్రిప్రగడ సత్యనారాయణరావు, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భాగ్యలక్ష్మీనగర్‌లో పర్యటన

శేరిలింగంపల్లి డివిజన్ భాగ్యలక్ష్మీనగర్‌లో ఎమ్మెల్యే గాంధీ పర్యటన సందర్భంగా కాలనీవాసులు సీసీ రోడ్లు, యూజీడీ లైన్లు, మంచినీటి పైప్‌లైన్, వీధి దీపాల ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలో యూజీడీ, మంచినీటి పైప్ లైన్ల పనులు పూర్తవగానే సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో డీజీఎం శరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేయాలని డీసీకి వినతి

చందానగర్: చందానగర్ జాతీయ రహదారిపై జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేయాలని, రోడ్డు దాటాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలు కాలనీలవాసులు సోమవారం సర్కిల్ 21 ఉప కమిషనర్ మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇటీవల జాతీయ రహదారిపై నూతన ఫ్లైఓవర్ ప్రారంభమైన నేపథ్యంలో ట్రాఫిక్ తీవ్రంగా మారడంతో శిల్పాఎన్‌క్లేవ్, బీహెచ్ఈఎల్ ఫ్రెండ్స్ కాలనీ, అన్నపూర్ణ ఎన్‌క్లేవ్ పరిసర ప్రాంతాల వృద్ధులు, వికలాంగులు, మహిళలు రోడ్డు దాటాలంటే అవస్థలు పడుతున్నామన్నారు. గతంలో చందానగర్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరైందని వెంటనే ఏర్పాటు చేయాలని డీసీకి విన్నవించారు. వినతిపత్రం అందించిన వారిలో కాలనీవాసులు జయకుమార్, శ్రీనివాస్‌రావు, శంకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



డీసీ మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీలవాసులు

ప్రజావాణి– 4 ఫిర్యాదులు

చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 4 ఫిర్యాదులు వచ్చాయని ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టౌన్‌ప్లానింగ్ 2, ఇంజనీరింగ్ 2 విభాగాలకు సంబంధించిన ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో ఏసీపీ నాగిరెడ్డి, ఇంజనీరింగ్, శానిటేషన్, యూబీడీ అధికారులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి సర్కిల్‌లో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెండు ఫిర్యాదులు అందజేశారు. టౌన్‌ప్లానింగ్, ఎన్నికల విభాగాలకు ఒక్కొక్క ఫిర్యాదు వచ్చినట్లు డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటరమణ, ఏఎంసీలు శ్రవణ్‌కుమార్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్‌లో అరుదైన శస్త్ర చికిత్స

మాదాపూర్: రాబిట్ పద్ధతి థైరాయిడ్ ఆపరేషన్ ఓ కొత్త పద్ధతి అని సీనియర్ రోబోటిక్ సర్జికల్ ఆంకాలజిస్ట్ అజయ్ వరుణ్‌రెడ్డి తెలిపారు. మాదాపూర్‌లోని మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో అరుదైన రోబోటిక్ స్కార్లెస్ థైరాయిడ్ సర్జరీ విజయవంతం అయిన సందర్భంగా సోమవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ రోబోటిక్ స్కార్లెస్ థైరాయిడ్ ఆపరేషన్ చాలా అరుదుగా జరుగుతుందన్నారు. భారతదేశంలో కేవలం నాలుగైదు ఆసుపత్రులకు మాత్రమే దీనికి కావాల్సిన అధునాతన టెక్నాలజీ, నిపుణులైన సర్జన్లు ఉన్నారన్నారు. సాధారణ థైరాయిడ్ ఆపరేషన్‌కి బదులుగా మెడమీద మచ్చలేకుండా అత్యాధునిక శస్త్ర చికిత్స అందిస్తున్నారన్నారు. మెడమీద, చేతికింద, ఛాతీ పైభాగంలో చిన్నకోత ద్వారా థైరాయిడ్ గ్రంధిని తొలగిస్తారు. రోబోటిక్ పద్ధతి వల్ల త్వరగా కోలుకోవడం, నొప్పి తక్కువగా ఉంటుందన్నారు. సుడాన్ దేశానికి చెందిన అబ్దుల్లాకు రాబిట్ పద్ధతిలో ఆపరేషన్ చేశారు. 48 గంటలలో డిశ్చార్జ్ చేసినట్టు తెలిపారు.



మాట్లాడుతున్న డాక్టర్ అజయ్ వరుణ్‌రెడ్డి

అక్రమ నీటి వ్యాపారంపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మక్తామహబూబ్‌పేట్ గ్రామస్తులు

మియాపూర్: మక్తమహబూబ్‌పేట గ్రామంలో అక్రమంగా బోర్లువేసి నీటి వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శేరిలింగంపల్లి మండల తహసీల్దార్ వెంకారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ... మక్తా గ్రామంలో కొంతమంది వ్యక్తులు అక్రమంగా బోర్లువేసి ట్యాంకర్ల ద్వారా నీటిని అమ్ముకుంటుండడంతో ఇళ్లల్లో ఉన్న బోర్లు ఎండిపోయాయని వాపోయారు. సత్యనారాయణ ఎన్‌క్లేవ్ కాలనీలో ఓ ఇంటి గేటు ముందు బోరువేసి నీటి వ్యాపారం చేస్తున్నారన్నారు. చర్యలు తీసుకోకపోతే కార్యాలయం ముందు ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

త్వరలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని దత్తాత్రేయ కాలనీలో రూ.18 లక్షల అంచనా వ్యయంతో, పాపమ్మ కాలనీలో 20 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు ఏర్పాటు చేయనున్న ప్రాంతాన్ని ఆల్విన్‌కాలనీ దొడ్ల వెంకటేష్‌గౌడ్ జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు నీరు నిలవకుండా ప్రణాళికతో రోడ్డు పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, నాయకులు సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, షౌకత్ ఆలీ మున్నా, పోశెట్టి గౌడ్, జగదీష్, అశోక్, రామకృష్ణ, ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తయ్యేలా చూడాలి

రాయదుర్గం: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని ఎమ్మెల్యే గాంధీ సూచించారు. జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి వెస్ట్ జోన్ జోనల్ కమిషనర్ హేమంత్ బోర్డేతో ఆయన సోమవారం ప్రత్యేకంగా సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులలో వేగం పెంచాలని, సకాలంలో నిధులు మంజూరయ్యేలా చూడాలన్నారు. వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలపై సిబ్బందిని అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు. రోడ్ల మరమ్మతులు , చెరువుల సుందరీకరణ, పార్కులు అభివృద్ధి చేయాలన్నారు. ఇందుకు జోనల్ కమిషనర్ హేమంత్ సానుకూలంగా స్పందించారన్నారు. ఈ సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

మనూలో 'మంథన్' వర్క్‌షాపు

రాయదుర్గం: భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ నిధులతో 'దివ్యాంగ్ సార్థి–స్మార్ట్ యాక్సెస్' వనరులు, సాధనాలు అనే ప్రాజెక్ట్ కింద మనూలో సోమవారం జాతీయ అవగాహన వర్క్‌షాప్ 'మంథన్'ను వీసీ ప్రొ.ఐనుల్ హసన్ ప్రారంభించారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ సంతోష్ కె పాండే మాట్లాడుతూ వైకల్యాలున్న వ్యక్తుల్లో డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించడం, సాంకేతిక పరిజ్ఞానం కల్పించడం లక్ష్యంగా భారత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ఆయన వివరించారు. ఆధార్, యూపీఐ, డిజి లాకర్, ఓఎన్‌డీసీ వంటి ప్రధాన డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ శ్రేణిలో ఈ ప్రాజెక్టు చేరుతుందన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్, ప్రొఫెసర్లు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్, అతిథులు

బీజేపీ ఆధ్వర్యంలో 'అమ్మ పేరు మీద ఒక మొక్క'



మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు



గోపనపల్లిలో మొక్క నాటుతున్న నాయకుడు రవికుమార్‌యాదవ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

చందానగర్: డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్‌ను పురస్కరించుకుని హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా హుడా కేఫ్ రోడ్డులో 'అమ్మ పేరు మీద ఒక మొక్క' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు జితేందర్ మాట్లాడుతూ శ్యామ్‌ప్రసాద్ కలలు కన్న ఒకే దేశం, ఒకే జెండా, ఒకే ప్రధాని విధానం రాబోతుందన్నారు. ఆయన చూపిన మార్గంలో భారతదేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి రాజు ముదిరాజ్, మాజీ అధ్యక్షులు శ్రీధర్‌రావు, మాజీ కౌన్సిలర్, నాయకులు రమణయ్య, జిల్లా మజ్దూర్ మోర్చా అధ్యక్షులు ఆళ్ల వరప్రసాద్, సత్యనారాయణ రాజు, జగదీశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గోపన్‌పల్లిలో..

రాయదుర్గం: 'ఒకే రాజ్యాంగం, ఒకే ప్రధాని, ఒకే చట్టం' ఉండాలని భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అభిప్రాయపడ్డారని, దాన్ని నిజం చేయాల్సిన సమయం ఆసన్నమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. శ్యామ్ ప్రసాద్‌ముఖర్జీ బలిదాన్ దివాస్ కార్యక్రమాన్ని సోమవారం గోపన్‌పల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తిరుపతి, రమేష్, రంగస్వామి,సురేష్, విష్ణు, క్రాంతి, జీవ, శ్రీను, రాజు,యాదయ్య, శివ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సర్వే ఆపాలంటూ సున్నం చెరువు బాధితుల ధర్నా

మాదాపూర్: సున్నం చెరువు పరిసర ప్రాంతాలలో నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయాలంటూ హైడ్రా అధికారులు నోటీసులు ఇవ్వడంతో పాటు సర్వే చేపట్టడంతో ఆ ప్రాంతవాసులు సోమవారం ధర్నా చేశారు. మాదాపూర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు కార్తీక్ బాధితులకు సంఘీబావం తెలిపారు. సర్వేని ఆపాలంటూ నినాదాలు చేశారు. సున్నం చెరువు బాధితులతో కలసి 100 అడుగుల రోడ్డులో ర్యాలీ చేశారు.



రథోత్సవం.. ట్రాఫిక్ సమస్యలపై సమీక్ష

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని జగన్నాథుని రథోత్సవంను పురస్కరించుకుని ట్రాఫిక్ ఏర్పాట్లను సోమవారం ఆలయ ప్రతినిధులతో కలిసి వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్, బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాశ్ గౌడ్ పరిశీలించారు. ఈ నెల 27వ తేదీ రథోత్సవం నేపథ్యంలో ఆలయానికి వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్‌పై సమీక్ష నిర్వహించారు. బసవతారకం కేన్సర్ ఆస్పత్రి నుంచి తెలంగాణ భవన్ వరకు, తెలంగాణ భవన్ నుంచి కొత్త రోడ్డు మీదుగా రోడ్ నం.12 వైపు, రోడ్ నం.12 కమాండ్ కంట్రోల్ సెంటర్ రోడ్డులో భక్తులు తమ కార్లను పార్క్ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. రథోత్సవానికి వచ్చేవారు తమ కార్లను బంజారాహిల్స్ రోడ్ నెం .10లోని ఐపీఎస్ క్వార్టర్స్ పక్కన, రోడ్ నెం. 12 ఏసీబీ కార్యాలయం ఎదురుగా, ఇస్కాన్ టెంపుల్ లోనూ పార్క్ చేసుకోవాలని సూచించారు.